క్లుప్తంగా

వంట పాత్రల వితరణ



మనుబోలు: మండల పరిధిలోని బీసీ కాలనీ సమీపంలో ఉన్న భగవాన్ శ్రీవెంకయ్యస్వామి మందిరానికి దాతలు కయ్యూరు సుధాకర్‌రెడ్డి, సుమతి దంపతులు రూ.20 వేల విలువైన వంట పాత్రలను మంగళవారం వితరణగా ఇచ్చారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ చేసినట్లు అర్చకుడు శ్రీనివాసులు తెలిపారు.

వేసవి శిబిరం పరిశీలన



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిబిరాన్ని ఎంఈఓ దిలీప్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆటల పోటీలు, తదితరాలతో విద్యార్థుల్లో విజ్ఞానం పెంపొందుతుందని చెప్పారు. గ్రంథాలయాధికారి మంజులత తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుడికి సన్మానం



మనుబోలు: కామర్స్‌లో వీఎస్‌యూ నుంచి డాక్టరేట్ పొందిన దందోలు దిలీప్‌కుమార్‌ను మంగళవారం సన్మానించారు. రాపూరు మండలం జోరేపల్లి గ్రామానికి చెందిన దిలీప్ మనుబోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కామర్స్ అధ్యాపకుడిగా ఉన్నాడు. అధ్యాపకులు శరత్‌బాబు, రమేష్, వేణుగోపాల్‌రెడ్డి, విజయ్‌కుమార్, మస్తాన్‌వలీ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతు బజార్ వెనుక వైపు గోడ తొలగింపు



పొదలకూరు: పట్టణంలోని రైతు బజార్ వెనుక వైపు గోడను మార్కెటింగ్ శాఖ ఇంజినీరింగ్ అధికారులు మంగళవారం తొలగించారు. బజార్ వెనుక వైపు గోడ కొంతభాగం ఓ ప్రైవేట్ స్థలంలో కలిసి ఉందని సంబంధిత వ్యక్తి న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. దీంతో మార్కెటింగ్ శాఖ అధికారులు న్యాయస్థానం ఉత్తర్వులను పాటిస్తూ ప్రైవేట్ స్థలంలో ఉన్న రైతుబజార్ గోడను తొలగించాల్సి వచ్చింది.

వెట్టిచాకిరీ వ్యవస్థపై ఆకస్మిక తనిఖీలు

- ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్

నెల్లూరు రూరల్: వెట్టిచాకిరీ వ్యవస్థలో కార్మికులను గుర్తించి విముక్తులను చేసేందుకు గానూ ఆకస్మిక తనిఖీలను చేపట్టాలని ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్ ఆదేశించారు. వెట్టి చాకిరీ వ్యవస్థ నిర్మూలన కోసం ఏర్పడిన జిల్లా విజిలెన్స్ కమిటీ తొలి సమావేశాన్ని కలెక్టరేట్‌లోని శంకరన్ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇటుక బట్టీలు, పరిశ్రమలు, దుకాణాలు, రొయ్యలు, చేపల గుంతలు, రైస్ మిల్లులు తదితరాల్లో కమిటీ సభ్యులు ఆకస్మిక తనిఖీలు జరిపి వెట్టిచాకిరీ బాధితులను గుర్తించాలని సూచించారు. వీరికి పునరావాసం కల్పించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని చెప్పారు. తొలుత పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సాంఘిక సంక్షేమ శాఖ, ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ ప్రతినిధులు గంటా ప్రియాంక, శ్యామ్ వివరించారు. సోషల్ వెల్ఫేర్ డీడీ శోభారాణి, కార్మిక శాఖ ఉప కమిషనర్ వెంకటేశ్వర్లు, మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ కృష్ణారెడ్డి, ఏఎస్సై శ్రీహరి, కమిటీ సభ్యులు బషీర్, సుదర్శన్, శ్వేత, సత్యవతమ్మ, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

- సమగ్ర జనాభా నిర్వహణ విధానంపై ప్రజాభిప్రాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం సేకరిస్తోందని, ఇందులో ప్రజలు భాగస్వాములు కావాలని ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్ ఒక ప్రకటనలో కోరారు. క్యూఆర్ కోడ్ టెక్నాలజీతో కూడిన మొబైల్ యాప్ ద్వారా అభిప్రాయాలను తెలియజేయాలని సూచించారు. పర్యవేక్షణకు గానూ ప్రతి మండలం, మున్సిపాలిటీకి ఒక సీనియర్ అధికారిని నియమించనున్నామని వెల్లడించారు. జిల్లా స్థాయిలో గ్రామ, వార్డు సభల నిర్వహణకు వివిధ విభాగాలు బాధ్యత వహించనున్నాయని పేర్కొన్నారు.

సమస్యలతో సహవాసం



మంచినీటి ట్యాంక్ వద్ద దుస్థితి



రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు

- కాలువల్లేక రోడ్లపై మురుగు
- ఇళ్ల స్థలాలూ కరువే
- ఎస్టీ కాలనీల్లో ఇదీ పరిస్థితి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని జొన్నవాడ ఎస్టీ కాలనీల్లో సమస్యలు తాండవిస్తున్నాయి. గ్రామంలోని పాత, కొత్త కాలనీల్లో 250కుపైగా కుటుంబాలున్నాయి. వీరిలో చాలా మందికి ఇళ్ల స్థలాల్లేవు. నెలకు రూ.1500 నుంచి రూ.రెండు వేల వరకు చెల్లించి బాడుగ ఇళ్లలో ఉంటున్నారు. టీడీపీ సారథ్యంలో ప్రభుత్వం ఏర్పడి ఏడాదైనా ఇప్పటివరకు తమను పట్టించుకున్న దాఖలాల్లేవని ఇక్కడి వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పడకేసిన పారిశుధ్యం

పాత, కొత్త ఎస్టీ కాలనీల్లో కాలువల్లేవు. ఉన్నవి భూమిలో కూరుకుపోయి ఉన్నాయి. దీంతో ఇళ్లలోని నీరు రోడ్లపై చేరి మురుగుతో నిండిపోతోంది. పాత ఎస్టీ కాలనీలోని మంచినీటి ట్యాంక్ వద్ద పరిస్థితి అధ్వానంగా మారింది. ట్యాంక్ చుట్టూ పాచిపట్టి నీరు నిల్వ ఉండటంతో దోమల మోత అధికమవుతోంది. నీరు కలుషితమవుతోంది.

పట్టించుకోని అధికారులు

ఎస్టీ కాలనీల్లో సమస్యలను అధికారులు, అధికార పార్టీ నేతలు పట్టించుకోవడంలేదు. కాలనీ వైపు పంచాయతీ సిబ్బంది కన్నెత్తి చూడటం లేదు. దీంతో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోతోంది. సంబంధిత అధికారులు ఇప్పటికైనా దృష్టి సారించి సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

బాడుగ ఇంట్లో ఉంటున్నాం



ఇళ్ల స్థలం లేకపోవడంతో బాడుగ ఇంట్లో ఉంటున్నాం. కూలీ పనులకెళ్తే మాకు బాడుగ కట్టడం భారంగా మారింది. స్థలాన్ని కేటాయించేలా చొరవ చూపాలి.

– అమ్మణ్ణి, ఎస్టీ కాలనీ

ప్రభుత్వం స్పందించాలి



నాకు నలుగురు పిల్లలు. ఇల్లు లేకపోవడంతో ఇబ్బందిగా ఉంటోంది. ప్రభుత్వం స్పందించి స్థలాన్ని మంజూరు చేసి ఇంటిని నిర్మించేలా చర్యలు చేపట్టాలి.

– కల్యాణి, ఎస్టీ కాలనీ

మురుగు పారేందుకు వీలేదీ..?



కాలువలను నిర్మించకపోవడంతో మురుగు పారేందుకు వీల్లేకుండాపోయింది. రోడ్లపై పేరుకుపోతున్న మురుగుతో అవస్థగా ఉంటోంది.

– సుగుణమ్మ, ఎస్టీ కాలనీ

ట్యాంక్ వద్ద శుభ్రపర్చాలి



మంచినీటి ట్యాంక్ వద్ద నీరు నిలిచి చుట్టూ చెత్త పేరుకుపోయింది. నీరు కలుషితంగా మారి వ్యాధులకు కారణమవుతోంది.

– నాగమణి, పాత ఎస్టీ కాలనీ

వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు: పట్టణంలో బుధవారం నిర్వహించనున్న వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయాలని మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పీఏసీ సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడారు. స్థానిక బజార్ సెంటర్ నుంచి ర్యాలీ ఉదయం తొమ్మిదికి ప్రారంభంకానుందని, భారీగా తరలిరావాలని కోరారు. చలపతిరావు, రాధాకృష్ణారెడ్డి, నరసింహులురెడ్డి మల్లికార్జున్ రెడ్డి, అనూప్‌రెడ్డి, సుబ్బారెడ్డి, బాలశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెంకటాచలంలో..

వెంకటాచలం: వెన్నుపోటు దినం కార్యక్రమం బుధవారం సర్వేపల్లి నియోజకవర్గ కేంద్రమైన వెంకటాచలంలో ఉదయం 10 గంటలకు ప్రారంభం కానుంది. సర్వేపల్లి క్రాస్‌రోడ్డు వద్ద నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు ర్యాలీ నిర్వహించనున్నాయి. ఎంపీలు మిథున్‌రెడ్డి, డాక్టర్ మద్దెల గురుమూర్తి, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె పూజిత హాజరుకానున్నారు. కూటమి ప్రభుత్వం పెట్టిన అక్రమ మైనింగ్ కేసు కారణంగా గోవర్ధన్‌రెడ్డిలో జైల్లో ఉండటంతో పూజిత వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని సర్వేపల్లిలో విజయవంతం చేసేందుకు చర్యలు తీసుకున్నారు. నాలుగు రోజుల నుంచి నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించారు. నేతలు, కార్యకర్తలు పాల్గొనాలని సూచించారు.

విరువూరులో నాట్లకు సిద్ధపడుతున్న రైతులు



ఏడాది పాలనంతా అవినీతి, అక్రమాలే



మాట్లాడుతున్న చలపతిరావు

కోవూరు: కూటమి ప్రభుత్వ ఏడాది పాలన అవినీతి, అక్రమాలతో పూర్తయిందని డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్ వీరి చలపతి విమర్శించారు. నెల్లూరులోని మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి నివాసంలో విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడారు. బుధవారం నిర్వహించనున్న వెన్నుపోట దినాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ అంటూ హామీలిచ్చి వాటిని విస్మరించారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలో తమకు అన్యాయం జరిగిందని మహిళలు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. వీటిని ప్రజలు గమనిస్తున్నారని, త్వరలోనే తగిన గుణపాఠం చెప్తారన్నారు. పార్టీ కోవూరు మండల కన్వీనర్ అనూప్‌రెడ్డి, బాలశంకర్ రెడ్డి పాల్గొన్నారు.

దేశ నాయకుల చరిత్రను తెలుసుకోవాలి



కొడవలూరు: దేశ నాయకుల చరిత్రను తెలుసుకోవడం ద్వారా విద్యార్థుల్లో మంచి నడవడిక ఏర్పడుతుందని ఉపాధ్యాయుడు ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మండలంలోని యల్లాయపాళెం గ్రంథాలయంలో దేశ నాయకుల చరిత్ర, దేశానికి వారందించిన సేవలను మంగళవారం వివరించారు. తెలుగు భాష గొప్పతనాన్ని తెలియజేసి, తెలుగును బాగా రాయడంపై శిక్షణ ఇచ్చారు. లైబ్రేరియన్ సురేంద్ర రెడ్డి పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్‌పై అవగాహన అవసరం



కార్యక్రమానికి హాజరైన గ్రామస్తులు




మాట్లాడుతున్న విజయన్

కొడవలూరు: సోలార్ విద్యుత్‌పై అవగాహన అవసరమని ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ సూచించారు. సోలార్ విద్యుత్‌పై మండలంలోని వెంకన్నపురంలో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు రాయితీని ఇస్తున్న తరుణంలో ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కోవూరు ఈఈ రమేష్ చౌదరి, డీఈఈ తలారి వెంకటేశ్వర్లు, ఏఈ రాములు, ఎస్పీవ ప్రతినిధి అజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో బాలుడి భవిష్యత్తు



చికిత్స పొందుతున్న అవినాష్



ఇంటిపై 11 కేవీ వైర్లు

- విద్యుదాఘాతంతో కుడి చేతిని కోల్పోయిన వైనం
- బాబాయ్ ఇంటికొచ్చి.. ప్రమాదానికి గురై

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో బాలుడి భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది. 11 కేవీ తీగలు తగిలి తీవ్రంగా గాయపడి.. చివరికి కుడి చేతిని కోల్పోయిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు.. నెల్లూరు రూరల్ పరిధిలోని పెద్దచెరుకూరు శివాలయ ప్రాంతంలో పేర్నేటి కార్తీక్‌రెడ్డి తన కుటుంబసభ్యులతో కలిసి నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో వేసవి సెలవుల నేపథ్యంలో హైదరాబాద్‌లో ఉంటున్న తన సోదరుడి కుమారుడు అవినాష్‌కుమార్‌రెడ్డి (10) వచ్చారు. ఈ నేపథ్యంలో గత నెల 16వ తేదీ సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో ఆడుకునేందుకు మిద్దె ఎక్కే క్రమంలో 11 కేవీ తీగలు తగిలాయి. విద్యుత్ సిబ్బంది ఏర్పాటు చేసిన వీ ఆకారపు క్లాంప్ ఒరిగి ఉండటంతో తీగలు ఇంటి ప్రాంగణంలోకి వచ్చాయి. దీన్ని గమనించకపోవడంతో అవినాష్ విద్యుదాఘాతానికి గురయ్యారు. చెన్నైలోని అపోలో ఆస్పత్రికి తరలించారు. చేతి నరాలు తీవ్రంగా కాలిపోవడంతో గత నెల 22న చికిత్స చేసిన వైద్యులు తప్పనిసరి పరిస్థితుల్లో అవినాష్ కుడిచేతిని తొలగించాల్సి వచ్చింది. ఇప్పటికే రూ.13 లక్షలు ఖర్చుకాగా, ప్లాస్టిక్ సర్జరీ, కృత్రిమ చేతికోసం మరో రూ.15 లక్షల వరకు అవుతుందని, మూడు నెలల పాటు ఆస్పత్రిలోనే చికిత్స చేయాల్సి ఉంటుందని వైద్యులు తెలిపారు. విద్యుత్ శాఖ నిర్లక్ష్యం కారణంగా ప్రమాదం జరిగిందంటూ నెల్లూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రాయితీపై పచ్చిరొట్ట ఎరువులు

పొదలకూరు: రాయితీపై పచ్చిరొట్ట ఎరువులు పంపిణీ చేస్తున్నట్టు ఏఓ ఎ.వాసు మంగళవారం తెలిపారు. రైతు సేవా కేంద్రాల ద్వారా జీలుగ, పిల్లిపెసర, జనుము విత్తనాలను అందజేస్తున్నట్టు వెల్లడించారు. జీలగ 100 క్వింటాళ్లు, పిల్లిపెసర 50 క్వింటాళ్లు, జనుము 30 క్వింటాళ్లు అందుబాటులో ఉంచామన్నారు. అవసరమైన రైతులు రైతు సేవా కేంద్రాల్లో పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు చూపించి తీసుకోవాల్సిందిగా సూచించారు.

ఆంజనేయస్వామికి విశేష పూజలు

పొదలకూరు: పట్టణంలోని మారుతీనగర్ వీర అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉభయకర్తలుగా సుర్తాని మల్లెం కొండయ్య కుటుంబ సభ్యులు వ్యవహరించారు. హనుమజ్జయంతి తర్వాత వచ్చే ప్రతి మంగళవారం రోజున సామాజికవర్గాల వారీగా ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. సాయంత్రం స్వామికి ప్రత్యేక పూజలు, పల్లకి సేవ జరిగాయి.

'ఇంటి నిర్మాణాన్ని అడ్డుకుంటున్నారు'

కోవూరు: తనకు నివేశన స్థలాన్ని ప్రభుత్వం కేటాయించిందని, అయితే నిర్మాణాన్ని కొందరు అడ్డుకుంటున్నారని బుచ్చిరెడ్డిపాళెం మండలం ఇస్కపాళేనికి చెందిన రుక్మిణి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం ఆమె మాట్లాడారు. స్థలాన్ని ఎలాగైనా కాజేయాలనే ఉద్దేశంతో తనపై కోర్టులో కేసును కొందరు వేశారని చెప్పారు. అయితే తనకు అనుకూలంగా తీర్పొచ్చిందని వివరించారు. ఈ క్రమంలో నిర్మాణ పనులను చేపట్టగా, అధికారులను కొందరు నేతలు తీసుకొచ్చి తనను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

వేడుకగా చప్పరోత్సవం

ఇందుకూరుపేట: బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని గంగపట్నంలోని చాముండేశ్వరిదేవి ఆలయంలో చప్పరోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. అమ్మవారిని పుష్పాలతో విశేషంగా అలంకరించి గ్రామంలోని వీధుల్లో ఊరేగించారు. పూజా కార్యక్రమాలను అర్చకులు అనిల్, రామకృష్ణ, కిశోర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈఓ తాతా శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

పది వేల సోలార్ కనెక్షన్లే లక్ష్యం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఈ నెల్లో పది వేల సోలార్ విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలనే లక్ష్యంతో పని చేయాలని ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ ఆదేశించారు. నగరంలోని విద్యుత్ భవన్ నుంచి జిల్లా అధికారులతో మంగళవారం నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. పీఎం సూర్యఘర్ సోలార్ పథకంపై అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని కోరారు. బీసీలకు కేంద్ర ప్రభుత్వం రూ.78 వేలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అదనంగా రూ.20 వేలను సబ్సిడీ రూపంలో ఇస్తోందని వివరించారు. సూర్యఘర్ నోడల్ అధికారి శేషాద్రి బాలచంద్ర పాల్గొన్నారు.

విత్తనాలెక్కడ..?

- ఎడగారు వరి సాగుకు శ్రీకారం
- బోర్ల కింద నాట్లు
- కాలువకు నీటి విడుదల
- అందుబాటులో లేని విత్తనాలు



మహ్మదాపురంలో వరినాట్లు

పొదలకూరు: మండలంలో డెల్టా గ్రామాలుగా పేరున్న మహ్మదాపురం, విరువూరు, సూరాయపాళెం, తాటిపర్తి, నేదురుమల్లి, వెలికంటిపాళెం, నల్లపాళెం గ్రామాల్లో ఎడగారు సాగుకు శ్రీకారం చుట్టారు. వరినాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. బోర్లు, కాలువల కింద సుమారు 5 వేల ఎకరాల్లో వరి వేసే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు వెల్లడించారు. మే నెలాఖరు నుంచే నాట్లు చేపట్టారు. పెన్నార్ డెల్టా గ్రామాల రైతులు కాలువ కింద సేద్యంతోపాటు ఫిల్టర్ పాయింట్ల ద్వారా వరిసాగు చేస్తుంటారు. ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు బాగుండటంతో 20 నుంచి 30 అడుగుల లోపలే పుష్కలంగా నీరు పడుతుంది. అయితే పల్లెల్లో దశాబ్దాలుగా ఎడగారు సాగుకు అలవాటు పడిన రైతులు నాట్లు వేయకుండా ఉండలేకపోతున్నారు. నావూరు, చెన్నారెడ్డిపల్లి గ్రామాల్లో సైతం ఈ ఏడాది ఎడగారు సాగు చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. ఇక్కడి అన్నదాతలకు దక్షిణ కాలువ ద్వారా సాగునీటిని అందించడం జరుగుతుంది.

విత్తనాల కోసం..

రైతు సేవా కేంద్రాల ద్వారా ఎడగారు సీజన్‌కు ప్రభుత్వం విత్తనాలు అందుబాటులో ఉంచలేదు. నాట్లు పడే అవకాశం ఉన్న గ్రామాలకు మాత్రమే విత్తనాలను అందజేయడం జరుగుతుందని అధికారులు వెల్లడించినా రైతులు బయటి మార్కెట్లో కొనుగోలు చేసి నార్లు పోసుకున్నారు. తాటిపర్తి, మహ్మదాపురం, విరువూరు, సూరాయపాళెం తదితర గ్రామాల్లో నాట్లు వేస్తున్నారు. ముఠా కూలీల ద్వారా ఎకరాకు రూ.4,700 చెల్లించి నాట్లు వేస్తున్నట్టు తెలిపారు.

ట్రాఫిక్ సమస్య తగ్గేదెలా..!



పంచాయతీ బస్టాండ్‌లో స్తంభించిన ట్రాఫిక్



బజారు రోడ్డుపై నిలిపిన ఆటోలు

- రోడ్లపై ఇష్టానుసారంగా ఆటోలు

పొదలకూరు: పట్టణంలో ట్రాఫిక్ సమస్య ఏ మాత్రం తగ్గడం లేదు. ఇష్టానుసారంగా గ్రామీణ ప్రాంతాల నుంచి ఆటోలు వచ్చి ట్రాఫిక్‌కు అడ్డంకిగా మారుతున్నాయి. పంచాయతీ బస్టాండ్‌లో పలువురు ఆటోల్ని బస్సులకు అడ్డుగా పెట్టడం వల్ల చిన్నపాటి ప్రమాదాలు జరుగుతున్నాయి. నాలుగు మండలాల వాహనాలు పట్టణం మీదుగా జిల్లా కేంద్రమైన నెల్లూరు నగరానికి వెళ్లాల్సి ఉంది. ఫలితంగా నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీనికితోడు వ్యాపారులు రోడ్డుమార్జిన్‌ను ఎవరికి వారు ఇష్టమొచ్చినట్టు ఆక్రమించడంతో ప్రధాన రహదారి ఇరుకురోడ్డుగా మారి తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. పట్టణం మీదుగా టిప్పర్లు, లారీలు వెళ్తుంటాయి. పెరుగుతున్న జనాభాతోపాటు ఇక్కడ ట్రాఫిక్ సమస్యలు జటిలమవుతోంది. రాపూరు, సైదాపురం, చేజర్ల, కలువాయి మండలాల నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు, లారీలు, టిప్పర్లతోపాటు ఆటోల సంచారం ప్రధాన సమస్యగా మారింది.

మితిమీరిన వేగం

పట్టణంలో కొత్తగా సిమెంట్ రోడ్డు నిర్మాణం జరిగింది. అయితే యువకులు ద్విచక్ర వాహనాలపై మితిమీరిన వేగంతో వెళ్తున్నారు. దీంతో రోడ్డు ప్రమాదాలు సంభవిస్తాయని ప్రజలు భీతిల్లిపోతున్నారు. పోలీస్ అధికారులు యువకులకు కౌన్సిలింగ్ ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందంటున్నారు.

నాయకత్వం – సాధికారతపై అవగాహన



సంజీవనగర్‌లో..



మిక్కిలింపేటలో..

కొడవలూరు: నాయకత్వం – సాధికారత అనే అంశంపై మండలంలోని మిక్కిలింపేటలో కిశోర బాలికలు, తల్లులకు అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కిశోరి వికాసం వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి మాట్లాడారు. అంగన్‌వాడీ కార్యకర్త కామేశ్వరి, హెల్పర్ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

⇨ మండలంలోని కమ్మపాళెం మజరా సంజీవనగర్‌లో కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగభూషణమ్మ, హర్షవర్ధిని, అంగన్‌వాడీ కార్యకర్త లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.